

మహబూబాబాద్‌లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యపు రాశులు

# ధాన్యం రైతుల దిగాలు!

- వడ్లు అమ్మి రోజులు గడుస్తున్నా అందని డబ్బులు
- 48 గంటల్లోనే చెల్లించాల్సి ఉన్నా పట్టించుకోని అధికారులు
- ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న అన్నదాతలు

మహబూబాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : ఆరుగాలం కష్టపడి ధాన్యం పండించిన రైతుల పరిస్థితి అధ్వానంగా మారింది. ధాన్యం డబ్బుల కోసం దైన్యంగా ఎదురు చూడాల్సి వస్తున్నది. కొనుగోలు కేంద్రాల్లో వడ్లు అమ్మి రోజులు గడుస్తున్నా డబ్బులు చేతికి అందకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి. కానీ, ప్రభుత్వ పట్టింపులేని తనం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా సకాలంలో చెల్లించకపోవడంతో పడరాని కష్టాలు పడుతున్నారు. వడ్లు అమ్మిన పైసలు రాక పెట్టుబడికి తెచ్చిన అప్పులు, కూళ్లు, రవాణా ఖర్చులు చెల్లించే స్తోమత లేక ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారు. జిల్లాలో 239 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, 23,350 మంది రైతుల నుంచి 1,06,905 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. వీటి విలువ రూ.247.88కోట్లు. కానీ, ప్రభుత్వం ఇప్పటివరకు 15,587 మంది రైతులకు 71,284 మెట్రిక్ టన్నులకు రూ.165.25 కోట్లు మాత్రమే చెల్లించింది. ఇంకా 7,763 మంది రైతులకు రూ.82.63 కోట్లు చెల్లించాల్సి ఉన్నది. 'మూలిగే నక్కపై తాటిపండు పడ్డ' చందంగా ఒకవైపు రుణమాఫీ కాకున్నా, మరోవైపు రైతుభరోసా అందకున్నా అప్పులు తెచ్చి పంట పండిస్తే, వాటికి కూడా ప్రభుత్వం సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. పౌరసరఫరాల సంస్థ అధికారుల నిర్లక్ష్యం వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం డబ్బులు సకాలంలో అందజేయాలని రైతులు కోరుతున్నారు.



### 14 రోజులైనా పైసలు రాలే..

ఈ నెల 15న కల్వలలోని కొనుగోలు కేంద్రంలో 8 క్వింటాళ్ల సన్నరకం ధాన్యానికి కాంటాలు వేశారు. 14 రోజుల క్రితమే బస్తాలు ఎగుమతయ్యాయి. రెండు రోజుల్లో పైసలు పడుతాయని చెప్పారు. కానీ, ఇప్పటి వరకు పైసా కూడా బ్యాంకు ఖాతాలో పడలే. మరి ప్రభుత్వం ఇచ్చే బోనస్‌కు ఇంకెన్ని రోజులు ఆగాలో అర్థం కావడం లేదు. యాసంగి పెట్టుబడి కోసం బ్యాంకు చుట్టూ తిరగాల్సి వస్తున్నది.

–చిర్రగానే చిన్ననారాయణ, రైతు, కేసముద్రం



ఫ్రీ బస్సు వద్దు.. పింఛన్ ఇస్తే చాలు..

కాంగ్రెస్ సర్కారు పెట్టిన ఫ్రీ బస్సు మాకొద్దు. దీనివల్ల మాకేం లాభం లేదు. మాకు ఇస్తామన్న రూ. 4 వేల పింఛన్ ఇస్తే చాలు. ఆ డబ్బులతోనైనా బతుకుతాం. పొట్టకూటి కోసం పని చేసుకునే మేము రోజు బస్సెక్కే పరిస్థితి లేదు. ఏడాదికి ఒకటి రెండు సార్లు బస్సులో పోతాం. అంతేగాని బస్సు ఫ్రీ పెట్టి మాకిచ్చే పథకాలు రద్దు చేస్తే ఎట్లా బతకాలి.

– రాచర్ల స్వర్ణలత, కొత్తవాడ



వృద్ధాప్య కార్మికులను ఆదుకోవాలి..

ఎప్పటి నుంచో నేత వృత్తిపై ఆధారపడ్డాం. ముసలితనంలోనూ చాతనైనంత పని చేసుకుంటూ బతుకుతున్నాం. పొద్దంతా పని చేసినా కడుపు నిండే పరిస్థితి లేదు. కనీసం మేం పోయినంకైనా ఇన్సూరెన్స్ డబ్బులొస్తే కుటుంబ సభ్యులు రోడ్డున పడకుండా ఉంటారు. ఇప్పుడు అదీ లేదని అధికారులు చెబుతున్నారు. ఇందిరమ్మ సర్కారు మమ్మల్ని ఆదుకుంటుందనుకుంటే, ఉన్నవాటిని తీసేస్తున్నారు. ఇదెక్కడి న్యాయమో మీరే చెప్పాలి. – నామని రమ, కొత్తవాడ

ఆధారం తెగిన చేనేత



## నేతన్నకు పథకాలు దూరం చేసిన కాంగ్రెస్ సర్కారు

- జాడ లేని చేనేత మిత్ర, బీమా, త్రిఫ్ట్ ఫండ్
- చేతినిండా పనుల్లేక పస్తులుంటున్న కార్మికులు
- ఫ్రీ బస్సు వద్దు.. పెంచిన పింఛన్ చాలంటున్న మహిళలు
- కేసీఆర్ ఉన్నప్పుడే బతుకులు సల్లంగ ఉన్నాయని వెల్లడి

# ఉన్నవి పాయె కొత్తవి రావాయె..

'సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడు మా బతుకులు సల్లంగ ఉన్నాయి. నేతన్నల కోసం అమలు చేసిన పథకాలు మాకు ధైర్యాన్నిచ్చాయి. ఆనాడు చీకు, చింతా లేకుండా హాయిగా బతికాం. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చినంక కొత్తవి దేవుడెరుగు.. ఉన్న పథకాలనూ లేకుండా చేశాడు. గిప్పడు ఎట్లా బతకాలో సమజ్ కావడం లేదు. రోజు రోజుకూ అన్ని ధరలు ఆకాశాన్నంటుతుంటే, మా బతుకులు పాతాళానికి పోతున్నాయి. చేతినిండా పనుల్లేక ఖాళీ కడుపులతోనే సహవాసం చేస్తున్నాం. ఇంటి దగ్గర, సంఘాల్లో పని దొరకక పస్తులుంటున్నం. ఇప్పుడు మా జీవనం సాగేదెట్లా' అని పలువురు నేత కార్మికులు లబోదిబోమంటున్నారు. సీఎం కేసీఆర్ అమలు చేసిన చేనేత మిత్ర, నేతన్నల బీమా, త్రిఫ్ట్ ఫండ్ అడ్రస్ లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. గతేడాది వరకు ఇచ్చిన ఈ పథకాలు ఏమయ్యాయని వారు ప్రశ్నిస్తున్నారు. ఒక్క పథకం కూడా ఇయ్యకుంటే మా బతుకులెట్లా అంటూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. 'ఫ్రీ బస్సు వద్దు.. రూ. 4 వేల పింఛన్ ఇస్తే చాలు. పని చేసుకునే మేము ఊకె బస్సు ఎందుకు ఎక్కుతాం.. దీనివల్ల మాకేం లాభం' అంటూ తమ అసంతృప్తి వెలిబుచ్చారు.

- పోచమ్మమైదాన్, డిసెంబర్ 29

సీఎం కేసీఆర్ హయాంలో చేనేత రంగానికి పెద్దపీట వేశారు. నేతన్నల కోసం పలు పథకాలు అమలు చేసి, అన్ని విధాలా ఆదుకున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే చేనేత మిత్ర, నేతన్నల బీమా, త్రిఫ్ట్ ఫండ్ పథకాల ఆచూకీ లేకుండా చేశారని నేతన్నలు ఆందోళన చేస్తున్నారు. చేనేత మిత్ర పథకంలో భాగంగా నేత కార్మికులకు అందజేసే యారన్ సబ్సిడీకి బదులుగా చేనేత సహకార సంఘాల్లో పనిచేసే కార్మికులకు నెలకు రూ.2వేలు, నూలు చుట్టే, పట్టే కార్మికులకు నెలకు రూ.500 చొప్పున ప్రభుత్వం అందజేసేది. అయితే ఏడాది నుంచి ఈ పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. అలాగే త్రిఫ్ట్ ఫండ్ కింద కార్మికుల వేతనాలను బట్టి నెలకు రూ. 800 చెల్లిస్తే రెట్టింపుగా రూ.1,600, నూలు పట్టే, చుట్టే కార్మికులు రూ. 400 కడితే రూ. 800 బ్యాంకులో జమ చేసేవారు. ఇదీ ఆగస్టు నుంచి బంద్ కావడంతో కార్మికులు బ్యాంకులో పొదుపు చేసుకునే పరిస్థితికి దూరమయ్యారు. ఇక రూ. 5 లక్షల ఇన్సూరెన్స్ పథకం జాడ లేదు. బీమాకు సంబంధించిన ఇన్‌స్టాల్‌మెంట్ గత ప్రభుత్వమే చెల్లించేది. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇన్‌స్టాల్‌మెంట్ కట్టకపోవడంతో నేతన్నలు బీమా సదుపాయాన్నీ కోల్పోయారు. అలాగే సంఘాల్లో పేరుకుపోయిన స్టాక్‌ను సకాలంలో టెస్కో అధికారులు కొనుగోలు చేయకపోవడం, బకాయిలు చెల్లించకపోవడంతో చేనేత సహకార సంఘాలు చతికిల పడే దుస్థితి ఏర్పడింది. దీంతో కార్మికులందరికీ చేతినిండా పని కల్పించలేకపోతున్నామంటూ సంఘాల పర్సన్ ఇన్‌చార్జిలు చెబుతున్నారు.

### కేసీఆర్ పథకాలన్నీ అమలు చేయాలి..



సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడు ఇచ్చిన పథకాలు అన్నీ మాకు ఇవ్వాలి. కొత్త సర్కారు వచ్చి ఏం లాభం లేదు. మాకు చేతి నిండా పని ఉండేటట్లు చేస్తుందని కలలు కంటే నిరాశే మిగిలింది. ఉన్న పథకాలు తీసేస్తే మేమెట్లా బతకాలి. చేతి నిండా పనిలేక చిల్లిగవ్వ ఉండడం లేదు. ఇట్లా అయితే మా పిల్లలను ఎట్లా చదివించుకోవాలె. పెళ్లిళ్లు ఎట్లా చెయ్యాలె. బయట పని చేసుకునే పరిస్థితి లేదు. సంఘాల్లో పనులు దొరకడం లేదు. ఇప్పటికే మా పిల్లలు ఇతర వృత్తులు చేస్తూ ఆసరాగా ఉంటున్నారు. మేము చేనేతను నమ్ముకుని జీవిస్తున్నాం. కాంగ్రెస్ సర్కారు పట్టించుకోకుంటే మాకు చావే శరణ్యం. – సారయ్య, మొండయ్య, మధు, సత్తయ్య, చేనేత కార్మికులు





### నేత కార్మికులకు అందని పథకాలు

చేనేత కార్మికులందరికీ పెన్షన్ ఇవ్వాలి. చేనేత మిత్ర పథకాన్ని సక్రమంగా అమలు చేసి ఆదుకోవాలి. గతంలో నెలకు రూ. 2 వేలు ఇచ్చేవారు. ఇప్పుడు నయాపైసా ఇవ్వకపోవడంతో ఎట్లా బతకాలి. రేవంత్‌రెడ్డి వచ్చి ఏమో చేస్తాడనుకుంటే ఉన్నవాటికి ఎగనామం పెట్టిండు. ఇన్సూరెన్స్ లేదు.. త్రిఫ్ట్ ఫండ్ అతీగతీ లేదు. ఇట్లా అయితే మేము పస్తులుండాల్సి వస్తుంది. పిల్లలను పోషించుకోలేకపోతున్నాం. దురదృష్టవశాత్తు కార్మికుడు చనిపోతే కనీసం బీమా డబ్బులపై ఆధారపడి కుటుంబ సభ్యులు బతుకుతారు. ఇప్పుడు ఇన్సూరెన్స్ కట్టడం లేదని అధికారులు చెబుతున్నారు. మేం ఎవరికి చెప్పుకోవాలి.

– దుబాసి ధర్మయ్య, ఎల్‌బీ నగర్



నల్లబెల్లి : రుద్రగూడెంలో పులి సంచరించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

- పలు చోట్ల పాదముద్రలను గుర్తించిన అటవీ అధికారులు
- నర్సంపేట నుంచి కొత్తగూడ అడవుల్లోకి..
- భయాందోళనలో రైతులు, కూలీలు, స్థానికులు

# పెద్దపులి సంచారంతో హైరానా



ఖానాపురం: కీర్యతండా శివారులో గుర్తించిన పులి పాదముద్రలు

నర్సంపేట/ఖానాపురం/కొత్తగూడ, డిసెంబర్ 29: పెద్దపులి సంచారంతో రైతులు, వ్యవసాయ కూలీలు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. శనివారం రాత్రి రుద్రగూడెం మీదుగా ఆదివారం నర్సంపేట మండలంలోని ముత్యాలమ్మతండా, జంగాలపల్లి తండాల మీదుగా ఖానాపురం మండలంలోని దబీర్‌పేట, కీర్యతండాల శివారుకు పులి వచ్చినట్లు అటవీ శాఖాధికారులు గుర్తించారు. అక్కడి నుంచి పాకాల అటవీ ప్రాంతం గుండా మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెం మండలం ఎంచగూడెం అటవీ ప్రాంతంలోకి ప్రవేశించినట్లు పాదముద్రల ఆధారంగా నిర్ధారించారు. సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముత్యాలమ్మ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని జంగాలపల్లితండాలో లకావత్ సీతారాములు చెలకలో పాదముద్రలు కన్పించాయి. నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి, ఎస్సైలు అరుణ్‌కుమార్, రవికుమార్ ఆధ్వర్యంలో పోలీస్, ఫారెస్టు అధికారులు అక్కడికి చేరుకొని పెద్ద పులి ఆనవాళ్లను గుర్తించారు. నల్లబెల్లి మండలం రుద్రగూడెం శివారులోని కెనాల్ మీదుగా నర్సంపేట మండలం జంగాలపల్లితండా శివారు పంట పొలాల్లోకి వచ్చినట్లు నిర్ధారించారు. అదేవిధంగా నర్సంపేట ఎఫ్‌ఆర్వో రవికిరణ్ ఆధ్వర్యంలో అటవీ శాఖాధికారులు ఖానాపురం మండలం కీర్యతండా శివారులోని బదావత్ రాములు పొలం వద్దకు వెళ్లి పాదముద్రలను పరిశీలించి, అవి పెద్దపులి వేనని నిర్ధారించారు.



నర్సంపేట: జంగాలపల్లితండాలో పెద్ద పులి పాదముద్రలను పరిశీలిస్తున్న ఫారెస్టు, పోలీస్ అధికారులు

### ప్రజలకు రక్షణ కల్పించాలి : మాజీ ఎమ్మెల్యే పెద్ది

నల్లబెల్లి: పులుల సంచారంపై స్పష్టమైన సమాచారంతో ప్రజలకు రక్షణ కల్పించాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. నియోజక వర్గంలో పులి సంచరించిన గ్రామాల్లో పాదముద్రలను పరిశీలించారు. ప్రజలు భయాందోళనకు గురికావొద్దని ఆయా గ్రామస్తులకు ధైర్యం చెప్పారు. అనంతరం ఎఫ్‌ఆర్వో, ఫారెస్ట్ అధికారులతో పెద్ది ఫోన్లో మాట్లాడి గూగుల్ మ్యాప్, డ్రోన్ కెమెరాల ద్వారా పులుల సంచారాన్ని గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్‌రావు, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఊడ్గుల ప్రవీణ్‌గౌడ్, నాయకులు శివాజీ, అమరేందర్‌రెడ్డి, సూరయ్య, అంబర గొండ రాజు తదితరులు పాల్గొన్నారు.

### రెండు రకాలుగా ఒప్పందం

బిల్లుల చెల్లింపుల్లో రెండు రకాల ఒప్పందం కుదిరినట్లు సమాచారం. ప్రభుత్వం రూ. 187.32 కోట్ల నిధులను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ)కి కేటాయించింది. అయితే ఆ నిధులు హైదరాబాద్ రెవెన్యూ శాఖలో ఉన్నాయి. వాటిని జీడబ్ల్యూఎంసీ అకౌంట్‌లో జమ చేస్తారా? లేదా ఆర్థిక శాఖ నేరుగా కాంట్రాక్టర్ల బిల్లులు క్లియర్ చేస్తుందా? అనే దానిపై స్పష్టత లేదు. అయితే కాంట్రాక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య ప్రధానంగా ఇదే చర్చకు వచ్చినట్లు సమాచారం. మున్సిపల్ అకౌంట్‌లో జమ చేస్తే కాంట్రాక్టర్ల బిల్లులు సులువుగా ఇక్కడే క్లియర్ అవుతాయి. రాష్ట్ర అర్థిక శాఖ నుంచి అయితే బల్దియా అధికారులు కాంట్రాక్టర్ల బిల్లుల చెక్కులు హైదరాబాద్‌లోని ఆర్థిక శాఖకు పంపించాల్సి ఉంటుంది. దీంతో కాంట్రాక్టర్లు మళ్లీ హైదరాబాద్ చుట్టూ తిరాగాల్సి వస్తుందని, అక్కడ పర్సంటేజీలు ఇచ్చుకోవాల్సి ఉంటుందని కాంట్రాక్టర్లు చెప్పినట్లు తెలిసింది. మున్సిపల్ అకౌంట్ నుంచి అయితే ఒక లెక్క, ఆర్థిక శాఖ నుంచి చెల్లిస్తే మరోలా ఇస్తామని కాంట్రాక్టర్లు చెప్పినట్లు తెలిసింది. ఇలా రెండు పద్ధతుల్లో పర్సంటేజీలు ఫిక్స్ చేసుకున్నట్లు సమాచారం.

బల్దియాలో కమీషన్ల దందా

# నీకింత.. నాకింత..

- పెండింగ్ బిల్లుల చెల్లింపునకు పర్సంటేజీలు
- కాంట్రాక్టర్లతో అధికారులు, ప్రజాప్రతినిధుల ఒప్పందం
- బిల్లుల తయారీలో నిమగ్నమైన అధికారులు
- తాజాగా రూ. 187 కోట్లు కేటాయించిన ప్రభుత్వం




వరంగల్, డిసెంబర్ 29 : బల్దియాలో పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లో కమీషన్ల దందా నడుస్తున్నది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ.187.32 కోట్లు కేటాయించిన నేపథ్యంలో ఒక్కసారిగా పర్సంటేజీలు తెరమీదకు వచ్చాయి. ఏళ్ల తరబడి చేసిన పనులకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్టర్లు.. ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేయడంతో కమీషన్లు ఇచ్చయినా సరే పెండింగ్ బిల్లులు క్లియర్ చేసుకోవాలని చూస్తున్నారు. ఇదే అదనుగా తీసుకున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ పర్సంటేజీ ఫిక్స్ చేస్తేనే ఫైల్ ముందుకు కదులుతుందని కొర్రీలు పెడుతున్నారు. దీంతో కాంట్రాక్టర్ల తరపున కొంత మంది సీనియర్లు ప్రజాప్రతినిధులు, అధికారులతో రెండు దఫాలు చర్చలు జరిపి కమీషన్‌పై అవగాహనకు వచ్చినట్లు సమాచారం. ప్రజాప్రతినిధులు, అధికారులు నేరుగా తెరపైకి రాకుండా వారి బినామీలతో చర్చలు జరిపి ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది.

**బల్క్‌గా చెల్లింపు**

ఒక్కో బిల్లు చొప్పున కాకుండా జారీ చేసిన చెక్కుల మొత్తానికి ఒకేసారి పర్సంటేజీ ఇచ్చేలా మాట్లాడుకున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులకు వేర్వేరుగా చెల్లించేందుకు కాంట్రాక్టర్లు ఒకే చెప్పినట్లు సమాచారం. అయితే రెండు రకాల ఒప్పందాల్లో జీడబ్ల్యూఎంసీ నుంచి నేరుగా చెల్లింపులు జరిపితే 10 శాతం, ఆర్థిక శాఖ నుంచి చెల్లిస్తే 7 నుంచి 8 శాతం కమీషన్ ఇచ్చేలా అవగాహనకు వచ్చినట్లు తెలిసింది. దీంతో అధికారులు పెండింగ్ బిల్లుల తయారీలో నిమగ్నమయ్యారు. రెండేళ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులు క్లియర్ చేయనున్నారు. ఒకేసారి రూ. 100 కోట్ల బిల్లులు చేస్తున్నట్లు సమాచారం.

హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌కు ర్యాలీగా వస్తున్న ఆశవర్కర్లు




- ఉద్యోగ భద్రత కల్పించాలి
- ఆశవర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి
- హనుమకొండకు చేరుకున్న బస్సు జాత

# ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 29: ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆశవర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ ఆశవర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు పీ జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిసెంబర్ 15 నుంచి ప్రారంభమైన రాష్ట్ర బస్సుజాత ఆదివారం హనుమకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా వేయి స్తంభాల గుడి నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ ఆడిటోరియంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. అనంతరం జయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ఆశల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని మ్యానిఫెస్టోలో చెప్పి, ఏడాదైనా ఒక్కటీ పరిష్కరించలేదని ఆమె మండిపడ్డారు.

# రాష్ట్రస్థాయి పోటీల్లో హనుమకొండ విజయభేరి

- సీఎం కప్ బ్యాడ్మింటన్‌లో 6 గోల్డ్ మెడల్స్
- వాలీబాల్‌లో విన్నర్‌గా వరంగల్ జట్టు





బ్యాడ్మింటన్ విజేత హనుమకొండ, వాలీబాల్‌లో విన్నర్‌గా నిలిచిన వరంగల్ జట్టు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 29: రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో హనుమకొండ షట్లర్లు ఆరు గోల్డ్‌మెడల్స్ సాధించి విజయభేరి మోగించారు. హనుమకొండ కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం జరిగిన బ్యాడ్మింటన్ బాలికల అండర్–19 విభాగంలో ఎం కీర్తి (హనుమకొండ) గోల్డ్‌మెడల్ కైవసం చేసుకోగా, బాలమన్వితరెడ్డి (రంగారెడ్డి) సిల్వర్, నయనిక రెడ్డి(సూర్యాపేట) బ్రాంజ్ మెడల్ సాధించినట్లు జిల్లా క్రీడాధికారి గుగులోత్ అశోక్‌కుమార్ తెలిపారు. బాలుర విభాగంలో అఖిల్‌రావ్(హనుమకొండ) గోల్డ్‌మెడల్, అబ్దుల్ రజాక్‌బేగ్ (హైదరాబాద్) సిల్వర్, ఆలీ సిద్ధిక్ (వరంగల్) బ్రాంజ్ మెడల్, బాలికల డబుల్స్ విభాగంలో పూజిత, నిఖితారావు (హనుమకొండ), నేత్ర సాల్ల, ఆకుల శ్రావ్య( మేడ్చల్ మల్కాజ్‌గిరి), అన్విరెడ్డి, నైనికరెడ్డి( సూర్యాపేట), బాలురలో అఖిల్‌రావు, ఎం అజయ్ కార్తీక్ (హనుమకొండ), వినయ్ సహస్ర్ రెడ్డి (రంగారెడ్డి), మోహన్‌కృష్ణ, పార్థసారథి (భద్రాద్రి కొత్తగూడెం), మిక్స్‌డ్ డబుల్స్‌లో అజయ్‌కార్తీక్, కీర్తి (హనుమకొండ), వినయ్, సంజన (రంగారెడ్డి), అనురాగ్ శర్మ, అనురాధ సింధు (హైదరాబాద్)లు వరుస స్థానా ల్లో నిలిచారు.

*అండర్– 15 విభాగంలో..*

బాలికల సింగిల్స్‌లో అవినీ విక్రమ్ గోవింద్ (రంగారెడ్డి), భూక్యా రిత్వికశ్రీ(భద్రాద్రి కొత్తగూడెం), శ్రీదేవిక ఆదిత్య (మేడ్చల్ మల్కాజగిరి) బాలుర సింగిల్స్‌లో పుప్పాల కిషవ్ (హైదరాబాద్), చిన్మయి వాంకడే (రంగారెడ్డి), అక్షత్ రెడ్డి (మేడ్చల్ మల్కాజగిరి), బాలికల డబుల్స్‌లో హర్షిత, పృథ్వి, పీఅన్య(మేడ్చల్ మల్కాజగిరి), లిల్లీ గ్రేస్, తేజస్విని (నల్లగొండ), కశ్యపి, గాయత్రి (రంగారెడ్డి), బాలుర డబుల్స్‌లో అక్షయ్‌కుమార్, శ్రీచైతన్‌శౌర్య (హనుమకొండ), చరణ్, విజయ్, బ్రహ్మిత్( మేడ్చల్ మల్కాజగిరి), చిన్మయి వంఖడే, రామ్ ప్రతీత్ (రంగారెడ్డి) మిక్స్‌డ్ డబుల్స్‌లో అక్షత్ రెడ్డి, శ్రీదేవిక ఆదిద్య(మేడ్చల్ మల్కాజగిరి), పీ అక్షిత్ రెడ్డి, జీ చందన(నల్లగొండ), ఎన్ రోహిత్‌కుమార్, భూక్యారిత్విక్‌శ్రీ(భద్రాద్రి కొత్తగూడెం)లు వరుసగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.

*హ్యాండ్‌బాల్ విజేత వరంగల్..*

బాలుర హ్యాండ్‌బాల్ విభాగంలో ఉమ్మడి వరంగల్ జట్టు, బాలికల్లో ఆదిలాబాద్ జట్లు స్వర్ణ పతకాలు సాధించాయి. బాలికల్లో వరంగల్ రజతం, రంగారెడ్డి కాంస్యం, బాలురలో మహబూబ్‌నగర్ రజతం, కరీంనగర్ కాంస్య పతకాలు సాధించాయి.

*సెపక్ తక్రాలో..*

పురుషులు, మహిళల్లో హైదరాబాద్ జట్లు స్వర్ణ పతకాలు సాధించాయి. మహిళల్లో కామారెడ్డి రజతం, నిజామాబాద్ కాంస్యం, పురుషుల్లో రంగారెడ్డి రజతం, ఆసిఫాబాద్ జట్టు కాంస్య పతకం సాధించింది.

*వాలీబాల్ విజేత వరంగల్*

ఖమ్మం సిటీ: సీఎం కప్‌లో భాగంగా ఆదివారం ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో అండర్–17 రాష్ట్రస్థాయి బాలుర విభాగంలో హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో వరంగల్ జట్టు విన్నర్‌గా నిలిచింది. మహబూబ్‌నగర్ జట్టు రన్నర్‌గా, ఖమ్మం జట్టు మూడో స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో నిజామాబాద్ జట్టు విన్నర్, మహబూబ్‌నగర్ జట్టు రన్నర్ ట్రోఫీలను కైవసం చేసుకోగా ఖమ్మం మూడో స్థానంలో నిలిచింది.